ప్రజాశక్తి
శుక్రవారం 1 ఆగస్టు 2025
5
అల్లూరి సీతారామరాజు



108 అంబులెన్స్‌లో ప్రసవం

-తల్లీ బిడ్డ క్షేమం

ప్రజాశక్తి- అనంతగిరి: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీకు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్య గోంద్రపాడు వద్ద ఆడ శిశువుని ప్రసవించింది. మండలంలోని భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పూతికవలస గ్రామానికి చెందిన నరవ. బుచ్చమ్మ కు ఏడో కాన్పు లో ఆడ శిశు కు జన్మనిచ్చింది, అక్కడనుండి వైద్యం కోసం విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



అంబులెన్సులో ప్రసవించిన బిడ్డ



తరగతులు నిర్వహిస్తున్నది ఈ భవనంలోనే..

శిథిల భవనంలోనే చదువులు

-పై పెచ్చులూడి పడుతుండటతో ఆందోళనలో విద్యార్థులు

-ఇదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దుస్థితి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ :అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల శిథిలావస్థ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం టీచర్ ట్రైనింగ్ సెంటర్ (టీటీసీ) కోసం నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థలో చేరి పెచ్చులూడి విద్యార్థులపై పడి గాయాలు పాలు అవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాంగి రామన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లకు తెలిపిన వివరాలు...అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ గ్రూపుల్లో 800 మంది బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. కొత్తగా నిర్మించిన భవనంలో ఆఫీస్ రూం, స్టాఫ్ రూం, కంప్యూటర్ ల్యాబ్, ఒక్కటే కంబైన్డ్ క్లాస్ రూం(డార్మటరీ రూం) ఒక్క ల్యాబ్ రూం ఉండడంతో తరగతులు నిర్వహించడానికి గదులు లేవు. దీంతో దశాబ్దాల క్రితం టీచర్ ట్రైనింగ్ సెంటర్ కోసం నిర్మించిన భవనంలోని తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో రూంలు లీకైపోతూ, శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో గతంలో చాలా సార్లు తరగతులు జరుగుతుండగా విద్యార్థులపై శ్లాబ్ పెచ్చులూడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆసుపత్రి పాలయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తరగతుల గదుల్లో విద్యార్థులు, అధ్యాపకులు బోధన సాగిస్తూ ఏ సమయంలో ఏం జరుగుతుందన్న ఆందోళనతో ఉంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరు కూడా స్పందించే పరిస్థితి లేదనిఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాంగి రామన్న అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి డిగ్రీ కళాశాలకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



తరగతి గదిలో ఊడుతున్న పెచ్చులు పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నేత రామన్న

వైసిపి పంచాయతీ అధ్యక్షుడి నియామకం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: వైసిపి పోతంగి గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా కమ్మిడి విజయదశమిని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పి పరశురాం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పంచాయతీ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయనను ఏకగ్రీవంగా కార్యకర్తలు ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు పి పరశురాం ప్రకటించారు అనంతరం నూతనంగా ఎన్నికైన విజయదశమి మాట్లాడుతూ, పంచాయతీలో పార్టీ బలోపేతానికి తన వంతు నిరంతరం పనిచేసే తోడ్పాటు అందిస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరావు వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్ ,మాజీ జెడ్పిటిసి ఎం శ్రీరాములు, ఉప సర్పంచ్ జగ్గు నాయుడు, వైసిపి నాయకుడు శంకర్, గణపతి అ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





నినాదాలు చేస్తున్న సురేంద్ర, నిర్వాసితులు

ఏకలవ్య పాఠశాలకు భూములిచ్చిన

రైతులకు ఉపాధి కల్పించాలి

-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అరకులోయ మండలం లోని బొండం పంచాయితీ మజ్జివలస గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన బాధిత రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు.గురువారం ఆదివాసీ గిరిజన సంఘం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర,జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, మండల కార్యదర్శి జి బుజ్జి బాబు, మండల ఉపాధ్యక్షుడు కె రామారావు, పేసా కమిటి కార్యదర్శి కె.అప్పన్న బృందం ఏకలవ్య పాఠశాలలో పర్యటించి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల గేట్ వద్ద భూములు ఇచ్చిన రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర మాట్లాడుతూ, బొండం మజ్జివలస గిరిజనులు ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఉపాధి అవకాశాలు, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూమి ఇచ్చిన రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలన్నారు. 2018-19 సంవత్సరంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి 16 మంది గిరిజనులు భూములు ఇచ్చారన్నారు. ఏకలవ్య పాఠశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, పరిహారం చెల్లించకుండా భూములు సేకరించి పాఠశాల నిర్మాణం పూర్తి చేసి ఆరు ఏళ్ళు గడిచినా పరిహారం చెల్లించ లేదన్నారు. ఉపాధి కల్పించకుండా ఐటిడిఎ తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన 16 మంది గిరిజన కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గొల్లూరి పరశురాం, కొర్ర నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని కొల్లాపుట్టు గ్రామపంచాయతీ గ్రామాల్లోని గిరిజనులకు గురువారం స్థానిక సర్పంచ్ పి రామ్మూర్తి అధ్యక్షతన నేచర్ సంస్థ యూనిసెఫ్ భాగస్వామ్యంతో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిదిగా మండల జెడ్పిటిసి సభ్యురాలు సిహెచ్ జానికమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి పలు సూచనలు అందించారు. నేచర్ సంస్థ ద్వారా ఇటువంటి వ్యాధులపై పాటల, మాటల ద్వారా గిరిజనుల నివాసి ప్రాంతాలకు వెళ్లి అర్థమయ్యే రీతితో వ్యాధిపై అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయం అన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ నేచర్ సంస్థతో 30 ఏళ్లుగా నా అనుబంధం ఉందని గుర్తు చేశారు. ప్రతి ఒక్క గ్రామాల్లో ఉన్న యువతి యువత సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం సెక్రటరీ గురుమూర్తి మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు శరీరానికి అవసరమైన ఆక్సిజన్ సరఫరా చేసే కణాల సంఖ్య తగ్గటం, దీనివల్ల రక్తహీనత లోపించడం, కళ్ళు పసుపు రంగులో మారటం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, నడిస్తే అలసట, గుండె దడ తతదితర లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నరేష్, ఉప సర్పంచ్ భీమన్న, వార్డు సభ్యులు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు, నేచర్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జెడ్‌పిటిసి

ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్‌పై

ప్రభుత్వవైఖరి తెలపాలి

- కోయ్‌త్తోర్ పండూం దక్కట్-కూనవరం జయప్రదం చేయండి
- ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-కూనవరం: ఏజెన్సీలో ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్‌పై ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని, ఆదివాసీ దినోత్సవం రోజున ఆదివాసీలకు బహుమతిగా జిఒ నంబర్ 3కు బదులుగా మరో జిఒను చట్ట రూపంలో ప్రకటించి న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కూనవరంలో బొగ్గ రామారావు అధ్యక్షతన జరిగిన ఆదివాసీ గిరిజన సంఘ మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలను వారి జీవన విధానాన్ని గుర్తించి ఐక్యరాజ్యసమితి సైతం ఆదివాసీలకు ఆగస్టు 9 వారి పండుగ రోజు అని గుర్తించిందని, కానీ నేడు మన పాలకుల విధానాలు ఆదివాసీల మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ పోస్టులు మినహాయించక పోవడం వలన ఆదివాసీ నిరుద్యోగ యువత అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 9న ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలను గుర్తు చేసే విధంగా, ఆదివాసీల ఐక్యత కొనసాగే విధంగా కూనవరంలో పెద్ద ఎత్తున ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో 'కోయ్‌త్తోర్ పండూం దక్కట్-కూనవరం' కార్యక్రమాన్ని చేపట్టామని ఆదివాసీలంతా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పాయం సీతారామయ్య, మండల అధ్యక్షుడు తెల్లం తమ్మయ్య, మండల కమిటీ సభ్యులు సోడేశంకర్, ఆదివాసి గిరిజన ప్రజా ప్రతినిధులు మడకం నాగమణి, బొగ్గ వెంకమ్మ, ఎంపిటిసిలు ధర్మల అమ్మాజీ కారం జయసుధ. ఆదివాసి గిరిజన నాయకులు మాడం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్‌పురం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కోయ్‌త్తోర్ పండూం దక్కట్ కూనవరం కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్,నాయకులు కారం సుందరయ్య పిలుపునిచ్చారు. మండలవ్యాప్తంగా అనేక గ్రామాల్లో పాఠశాలల్లో ప్రచారం నిర్వహించామన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

సిపిఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - చింతూరు : ఈనెల 8, 9 తేదీల్లో రంపచోడవరంలో జరిగే సిపిఐ రెండో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని చింతూరులో గురువారం సిపిఐ నాయకులు గడపగడపకూ ముమ్మర ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా చింతూరు డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్‌రావు మాట్లాడుతూ సిపిఐ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని సమ సమాజ స్థాపనకు ప్రజలకు అండదండగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేపట్టిందని పేర్కొన్నారు. అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లా ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఖనిజ సంపదను కాపాడుకోవడానికి పలు ఉద్యమాలు నిర్వహించిందని, చింతపల్లి నియోజకవర్గం నుండి గొట్టేటి దేముడు రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో శాసనసభకు ఎన్నికై గిరిజన సమస్యలపై గళమెత్తారని గుర్తు చేశారు. పోడు భూముల పట్టాల కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిందన్నారు. జిఒ నంబర్ 3 రద్దుతో నిరుద్యోగులు రోడ్డున పడ్డారని వలస కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభకు ఆర్థికంగా హార్దికంగా కార్యకర్తలు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. చింతూరు డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్ రావు, సహాయకార్యదర్శి రంజాన్, చింతూరు మండల సహాయ కార్యదర్శి తుర్రం మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చింతూరు: మండలంలోని పలు విద్యుత్తు లైన్‌లలో ఆటంకం ఉన్న చెట్లను తొలగించేందుకు విద్యుత్ శాఖ శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని కావున వినియోగదారులందరూ సహకరించాలని విద్యుత్ ఇఇ ఎపిఇపిడిసిఎల్ రంపచోడవరం గాబ్రియల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

34 మందికి కొత్త పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి- వై.రామవరం: మండలంలో వితంతులు, వృద్ధులు, కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా 34 మందికి కొత్తగా మంజూరయ్యాయని ఎంపిడిఒ బాపన్నదొర తెలిపారు. మండలంలో మొత్తం 3,242 మందికి రూ.1.32 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు.

బూత్ ఇన్‌చార్జికి సన్మానం

ప్రజాశక్తి - చింతూరు: మండలంలో చింతూరు పంచాయతీ పరిధిలో 354 బూత్‌లో 'సుపరిపాలన తొలి అడుగు' శతశాతం పూర్తి చేసిన బూత్‌ఇంచార్జ్ ప్రశాంత్, వంజంరాజును చింతూరు మండల కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చింతూరు మండల అధ్యక్షులు ఇళ్ల చిన్నారెడ్డి, క్లస్టర్ ఇంచార్జి నరసింహారావు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్రబృందం సభ్యుడు హేమంత్‌కుమార్

స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమం పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ గరిమండ, బాలరేవుల, నూకరాయితోట, బూదరాళ్ల గ్రామాల్లో కేంద్ర బృందం గురువారం పర్యటించినట్టు సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ వార్డ్ సభ్యుడు సంజీవులు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ- 2025 కార్యక్రమాన్ని కేంద్ర బృందం సభ్యుడు హేమంత్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడిచెత్త-పొడిచెత్త నిర్వహణ, మరుగుదొడ్లు వినియోగం గురించి ఆయా గ్రామస్తులతో మాట్లాడారు. అంగన్‌వాడీసెంటర్లు, పిహెచ్‌సిలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు వినియోగం, పారిశుధ్య నిర్వహణ, పరిస్థితులు గురించి సర్వే నిర్వహించి ఆయా పంచాయతీలకు ర్యాంకులను ఇవ్వడం జరుగుతుందని హేమంత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్, తేజ ఎంపిటిసి వంతల నారాయణ, పంచాయితీ కార్యదర్శి లీలాకృష్ణ, మహిళ కార్యదర్శి మొట్టడం సింహాచలం పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు

ప్రజాశక్తి- రంపచోడవరం : ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ఎంతమంది లెక్చరర్స్ ఉన్నది ముందుగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేసే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని విద్యార్థులకు ఎప్పటికప్పుడు పాఠాలు చెప్పి చదివించే బాధ్యత కూడా సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఈ కళాశాలలోని గ్రౌండ్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.కృష్ణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

గిరిజనులకు మంచి సేవలు అందించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం గిరిజన ప్రజలకు ఏ ఉద్యోగి అయినా మంచిసేవలు అందిస్తే వారి గుండెల్లో స్థిరంగా ఉంటారని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్‌పి ఫంక్షన్ హాల్‌లో జిసిసి డివిజనల్ మేనేజర్ పార్వతీశ్వర రావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయనతో పాటు రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, రంప చోడవరం సబ్ డిఎఫ్ఒ అనుష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలో అర్హులైన తెల్లరేషన్‌కార్డుల లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు ప్రతినెల రేషన్ అందించడంలో పార్వతీశ్వరరావు ఎంతగానో శ్రమించారన్నారు. ఏజెన్సీలో వరదలు వచ్చినప్పుడు ఎప్పటికప్పుడు ముందుగానే సంబంధిత మండల స్టాక్ పాయింట్లకు సివిల్‌సప్లై ద్వారా రేషన్ ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్ కూడా ఆయన సేవలను కొనియాడారు.



పార్వతీశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న పిఒ తదితరులు



నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

సాగునీరు విడుదల

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : ఒట్టిగెడ్డ రిజర్వాయర్ నుండి సాగునీరు రైతులు చీడిపల్లి అప్పారావు, ఎంపిటిసి నల్లా సత్యన్నారాయణ గురువారం విడుదల చేశారు. రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేటలో ఉన్న రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేశారు. నీటిని విడిచిపెట్టడంతో రైతుల హర్షం వ్యక్తం చేశారు. రిజర్వాయర్ పోడుగుతేరు పనులు చేపట్టాలని చైర్మన్ సత్యనారాయణకు రైతులు విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక స్థాయి నుంచే గుణాత్మక విద్యాబోధన


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పిటిసి గంగరాజు

ప్రజాశక్తి అనంతగిరి:విద్యార్థిని విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండే గుణాత్మకమైన విలువలతో కూడిన విద్యా ప్రమాణాలు అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయవలసిన అవసరం ఉందని స్థానిక జెడ్పిటిసి దిసరి. గంగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పర్యటించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఆరా తీశారు. తరగతి గదుల్లో వెళ్లి చదివించి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపిపి పాఠశాలలో 1 తరగతి నుండి 5 వ తరగతి వరకు 161 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారన్నారు. 6 గురు ఉపాధ్యాయులు ఉన్నారని, ఇంకొక ఉపాధ్యాయులు భర్తీ చేయవలసిన ఉందన్నారు. కొంతమంది తడబాటు ఉన్న విద్యార్థులకు రెండు నెలల్లో మంచిగా చదివే విద్యార్థులుగా తీర్చి దిద్దాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచనలు చేశామన్నారు. మార్పు అనేది విద్య తోనే ప్రారంభం అవుతుందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాంగి. అర్జున్, ఉపాధ్యాయులు శ్రీరాములు, అప్పారావు, పార్వతి పాల్గొన్నారు

ఎన్నికల హామీ అమలు ఏదీ?


ప్రచారం చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయితీ కోసంగి పనసపుట్టు మెడల్ కాలని గ్రామంలో వైసిపి మండల అధ్యక్షుడు పి పరశురామ్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపిపి బి ఈశ్వరి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్ ఆనంద్, సర్పంచ్ టి వెంకటరావు, వైస్ సర్పంచ్ జగ్గు నాయుడు, మాజీ జెడ్పిటిసి ఎం శ్రీరాములు, వైసిపి పోతంగి గ్రామపంచాయతీ అధ్యక్షుడు కె విజయదశమి , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా పశు ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి-జిమాడుగుల: హెచ్ఆర్ఐడిఎస్ ప్రాజెక్ట్ సి ఎస్ ఏ, సహకార సంస్థ, గిరి సిరి ఎఫ్‌పిసిఎల్ ప్రాజెక్ట్ మేనేజర్ కమలనాధ్ ఆధ్వర్యంలో వేల్మామిడి గ్రామంలో మెగా పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా వెటర్నరీ ఆఫీసర్ ప్రియదర్శిని పాల్గొని మాట్లాడుతూ, గ్రామీణ రైతులకు మేకలు, కోళ్ల వంటి లైవ్‌స్టాక్ ఆరోగ్యంపై అవగాహన కల్పించడం జరిగిందని, వాటి ఉత్పాదకత పెంచడంపై వివరించడం జరిగిందన్నారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో వి.రమేష్. శివ నారాయణ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే

అసిస్టెంట్ కలెక్టర్ నాగ వెంకట సాహిత్



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు :వృద్ధాప్యంలో తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉందని అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్ అన్నారు. విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులను తీసుకుని వదిలేయడం, జీవనాధారం లేకుండా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పట్టణ ప్రాంతాలలో జీవనం లేక పిల్లలు పట్టించుకోక పోవడంతో యాచన చేస్తున్న దృశ్యాలను చూస్తున్నామని చెప్పారు... సమాజంలో సీనియర్ సిటిజన్లను కాపాడ వలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులు కనీస అవసరాలు భోజన, వసతి, వైద్య సహాయం అందించే బాధ్యత కన్న పిల్లలపైనే ఉందని స్పష్టం చేసారు. సీనియర్ సిటిజన్ల రక్షణపై అవగాహనా సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు.
జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత మాట్లాడుతూ, విద్యా సంస్థల్లో తల్లిదండ్రులు, వృధ్ధుల సంరక్షణపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విభిన్న ప్రతిభా వంతులు హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వృధ్ధుల సంరక్షణ పై కళాజాతాలతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రధాన మంత్రి వయో వందన యోజన పథకం ప్రయోజనాలను వివరించారు. 70 ఏళ్ళ పై బడిన వధ్ధులు ప్రధాన మంత్రి వయో వందన యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధి టి.రవి మాట్లాడుతూ తల్లిదండ్రులు మరియు సీనియర్ సిటిజన్ల పోషణ, సంక్షేమ చట్టం 2007 గురించి వివరించారు. తల్లిదండ్రుల నుండి ఆస్తులు తీసుకుని అనంతరం వారి పోషణ పట్టించుకోలేదని పిల్లలపై ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుని రూ.5వేల వరకు జరిమానా, మూడు నెలలు జైలు శిక్ష విదిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్బి ఎస్ నంద్, సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, జిల్లా సెరీకల్చర్ అధికారి కె. అప్పారావు, డి ఇ ఓ పి. బ్రహ్మాజీరావు, జిల్లా పరిశ్రమల అధికారి జి.రవిశంకర్, స్వమా పిడి విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి కె.పి.

రిటైర్డు ఉపాధ్యాయినికి ఘన సత్కారం


సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గేదలబంధ మజ్జిపుట్టు ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్న పీతల రజిత ఉపాధ్యాయురాలు గురువారం పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఆ గ్రామస్తులు, మండల విద్యాశాఖ అధికారి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎస్ సుందర్ రావు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ళు నుంచి విధులు నిర్వర్తిస్తూ గిరిజన విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారని ఆయన కొనియాడారు. ఉద్యోగ విరమణ పొంది శేష జీవితంలో కుటుంబ సమేతంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టిఏ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కే సుబ్బారావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు కే,సంజీవరావు ఎం.శ్రీను ఎం సత్యనారాయణ, గ్రామస్తులు, విద్యార్థుల ,తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు వైద్యానికి రూ.17 లక్షల జరిమానా

వినియోగదారుల కమిషన్ కోర్టు సంచలన తీర్పు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : వ్యాధి నిర్ధారణ చేయకుండా చికిత్స చేసి మహిళ మృతికి కారణమయ్యారనే అభియోగంతో వైద్యులకు రూ.17లక్షల పరిహారం చెల్లించాలని విశాఖ జిల్లా వినియోగదారుల కమిషన్ 2 అధ్యక్షురాలు జి వెంకటేశ్వరి, సభ్యులు పి విజయదుర్గ, కరకు రమణబాబు గురువారం తీర్పునిచ్చారు. వైద్యానికి మృతురాలి కుటుంబ సభ్యులు చెల్లించిన రూ.1,70, 443లను 24 శాతం వడ్డీతో 2017 ఫిబ్రవరి 9వ తేదీ నుంచి చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు తీర్పులో పేర్కొన్నారు. కోర్టు ఖర్చులు కింద మరో రూ.ఐదు వేలు ఇవ్వాలని స్పష్టం చేశారు.మృతురాలి లావేటి ఢిల్లీ రావు తెలిపిన వివరాలివి.
లావేటి మహేశ్వరికి 2017 ఫిబ్రవరి నెలలో కడుపులో నొప్పి రావడంతో స్థానిక వైద్యుడు డాక్టర్ జి శ్రీధర్‌ను సంప్రదించారు. కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమని కంచరపాలెం సన్‌రైజ్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ తనూజ ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. వ్యాధి నిర్ధారణ సక్రమంగా చేయకుండా అందించిన వైద్యసేవలతో మహేశ్వరి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో చివరకు నగరంలోని ఓమ్ని ఆర్కే ఆసుపత్రిలో ఆపరేషన్ చేసినా రోగి మృతి చెందింది. తనకు జరిగిన అన్యాయంపై మృతురాలి భర్త ఢిల్లీరావు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా, విచారణ తర్వాత అభియోగాలపై నిర్ధారణకు వచ్చిన కమిషన్ అధ్యక్షురాలు, సభ్యులు ఈ మేరకు తీర్పుచెప్పారు.

ఎట్టకేలకు తారురోడ్డు సాకారం


నిర్మిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి-చింతపల్లి:అంజలిశనివారానికి తారు రహదారి కల నేడు సాకారమైంది. అప్పటి మంత్రి పసుపులేటి బాలరాజు తాజంగి నుంచి జాజులపాలెం వరకు తారు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం తెదేపా ప్రభుత్వ హయంలో అరకు ఎంపీగా ఉన్న కొత్తపల్లి గీత రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసినా, నిర్మాణం సాగలేదు. తరవాత గిడ్డి ఈశ్వరి, కొట్టగల్లి భాగ్యలక్ష్మిలు కూడా శంకుస్థాపనలు చేసినా అవి శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అంజలిశనివారాన్ని సందర్శించిన ఆయనకు రహదారి బాధను వినిపించారు. దీంతో రహదారి పనులను వేగవంతం చేసి, నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

సామాజిక భవనాల ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : కోరమండల్ ఫెర్టిలైజర్స్ సౌజన్యంతో జివిఎంసి 58వ వార్డు గుల్లలపాలెంలో రూ.42లక్షలతో, ములగాడలో రూ.12లక్షలతో నిర్మించిన సామాజిక భవనాలను విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ పి.గణబాబు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కోరమండల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కె..రంగకుమార్, కెవిపివైఎస్ నారాయణ, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ రెడ్డిపల్లి శ్రీనివాసరావు, కార్పొరేట్ సిఎస్ఆర్ హెడ్ సి. జయగోపాల్ , సేఫ్టీ హెడ్ నాగరాజు, సిఎస్ఒనారాయణ పాత్రుడు, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, సిఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ శేషాపు వెంకటరమణ, స్థానిక పెద్దలు ధర్మాల వేణుగోపాలరెడ్డి,కారాడ రాము, రఘు, మురళి టిడిపి వార్డు అధ్యక్ష, కార్యదర్శులు కోరాడ శ్రీనివాస్, పోతబత్తుల శ్రీను, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, అంగ ప్రశాంతి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం ఎన్‌జివో కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని 430 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్ సురేష్ కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 64 మందికి దృష్టి లోపం ఉన్నట్లు నిర్ధారించారు. కళ్లద్దాలు అవసరమైన వారు 58 మందికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ నెలాఖరు వరకు 595 పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తారని ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి వెల్లడించారు.కార్యక్రమంలో హెచ్ఎం రాధాకుమారి, రిసోర్స్ టీచర్లు జగదాంబ, శారద పాల్గొన్నారు

కేర్ 'సంఘం' హెల్త్ కార్డుతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : కేర్ ఆసుపత్రికి ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రజలకు రాయితీలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆరిలోవ కేర్ ఆసుపత్రి సంఘం పేరుతో పేషెంట్ మెంబర్ షిప్ కార్డును గురువారం ప్రారంభించింది. కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూక్ చౌదరి కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్, ఇండోర్ ఆసుపత్రిలో ఇప్పటికే ప్రయోగాత్మకంగా ప్రారంభించిన సంఘం కార్డుతో రోగులు ప్రయోజనం పొందారన్నారు. ఆసుపత్రికి ఐదు కిలోమీటర్ల ఉన్న ప్రజలు ఉచితంగా కార్డును పొందవచ్చన్నారు. ఈ కార్డు ద్వారా మొదట సారిగా ఉచిత డాక్టర్ కన్సల్టేషన్ పొందవచ్చని, ల్యాబ్ పరీక్షలపై 20 శాతం, మందుల కొనుగోలుపై 15 శాతం, ఉచిత అంబులెన్స్ సౌకర్యం నిరంతరం పొందవచ్చన్నారు. ఫొన్ 9133354516 నెంబరుకు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. సమావేశంలో డాక్టర్ సదన్ కుమార్, డాక్టర్ ఆసిస్ ఉపాధ్యాయ పాల్గొన్నారు

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం మండలం సీతపల్లి గ్రామంలోని గడిబాపనమ్మ తల్లి ఆలయ చైర్మన్‌గా కుంజం బాపన్న దొర ప్రమాణ స్వీకారం చేశారు. సిద్ద వెంకన్న , సుంకర పెంటమ్మ , బొగ్గుల లక్ష్మి కారు లక్ష్మి, భవాని, మచ్చా అబ్బులు, కాళ్ళకూరి సత్య సుందరరావు, కొరువాడ బాబురావు ట్రస్ట్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయకమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గోపవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిసిసి డైరెక్టర్ గొర్లె సునీత, బిజెపి జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి, నియోజకవర్గ అబ్జర్వర్ కొల్లిబోయిన శ్రీనివాస్‌యాదవ్, రంపచోడవరం మండల ప్రజలు, టిడిపి సీనియర్ నాయకులు కారం సురేష్‌బాబు, అడబాల బాపిరాజు, పెంతపటి మోహన్, దిండి జనార్దన్, కారం సింహాచలం, చవలం బాపిరాజు, వై.నిరంజినిదేవి పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొయ్యూరు : కొయ్యూరు మండలం రామరాజుపాలెం వంతెన వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కేడీపేట వైపు నుంచి బైక్‌పై వస్తున్న ఆ వ్యక్తి వంతెన వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పడంతో బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి పాడి గ్రామానికి చెందిన సింహాచలంగా స్థానికులు తెలిపారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

అంగన్‌వాడీలకు ట్యాబ్‌లు ఇవ్వాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : అంగన్‌వాడీలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొయ్యూరు మండల ప్రాజెక్టు కార్యదర్శి అచ్చియమ్మతో కలసి సభ్యులతో సమావేశం నిర్వహించారు. చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.26,000 వేతనాలు పెంపు, మినీలకు మెయిన్ సెంటర్లు మార్పు చేస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జులై 21న అన్ని సిడిపిఒ కార్యాలయాలతో పాటు డైరెక్టర్. ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రాలు అందజేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 4న ఫోన్లు తీసుకువెళ్లి సిడిపిఒకు తిరిగి ఇచ్చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అప్పల నాయుడు. సూరిబాబు, బొంజుబాబు, అంగన్‌వాడి సెక్టార్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలియజేయాలి


మాట్లాడుతున్న ఎస్ఐ పార్థసారథి

ప్రజాశక్తి-అడ్డతీగల: మండలంలోని రాయపల్లి పంచాయతీ వంగలమడుగు గ్రామంలో ఎస్సై పార్థసారథి గురువారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో గత కొన్ని రోజుల క్రితం భార్యాభర్తలు ఘర్షణ పడిన ఘటనలో భార్య మృతి చెందింది. ఈ సందర్భంగా ఎస్ఐ పార్థసారథి ప్రజలందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా తన దగ్గరికి రావాలన్నారు. నాటుసారా, గంజాయి, ఇతర ఏ విధమైన మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్టు, రవాణా చేస్తున్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

అప్టిట్యూడ్ టెస్టులతో ప్రతిభ వెల్లడి



మాక్ట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మేనేజర్ రవికుమార్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : అప్టిట్యూడ్ టెస్టుల ద్వారా విద్యార్థులలో ఉన్న సహజ ప్రతిభ, బలాలు, పరిమితులు బయటపడతాయని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ తెలిపారు. ద్వారకానగర్ బ్రాంచ్‌లో 'మిలీనియం అప్టిట్యూడ్ - కోడింగ్ టెస్ట్ (మాక్ట్) - 2025' పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, ఇలాంటి పరీక్షలు విద్యార్థుల ఆలోచనా స్థాయిని పెంపొందిస్తాయని, తద్వారా పోటీ పరీక్షలను సులభంగా అధిగమించగలరని తెలిపారు. ప్రొఫెషనల్ నాలెడ్జ్‌తో పాటు క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్‌ను కూడా విద్యార్థులు మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సంవత్సరం ప్రత్యేకంగా కంప్యూటర్ స్ట్రీమ్ విద్యార్థుల కోసం కోడింగ్ టెస్టును కూడా ప్రవేశపెట్టామని చెప్పారు. ఆమెజాన్, టెస్లా, టిసిఎస్, ఇన్ఫోసిస్ తదితర అంతర్జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూకు ముందు అప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో, విద్యార్థులు తమ స్థాయిని తెలుసుకోవడానికి ఉత్తమ అవకాశం అని వివరించారు. హెచ్.ఆర్ మేనేజర్ బి.దివ్యజ్యోతి మాట్లాడుతూ, ఆగస్టు 2 నుండి సెప్టెంబర్ 28వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాల్లో మిలీనియం క్యాంపస్‌లో ఈ టెస్టులు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ (బిడిఎం), అశోక్ (బిడిఈ) పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇల అభివృద్ధికి విశాఖ ట్యాక్స్ నిపుణుల తోడ్పాటు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : జిఎస్‌టిపిలు, అకౌంటెంట్లు, టాక్స్ న్యాయవాదులు, ఇతర నిపుణుల కృషిని గుర్తించి, గౌరవించడానికి 'టాక్స్ అండ్ అకౌంటింగ్ టైటాన్స్' ప్రత్యేక కార్యక్రమాన్ని ట్యాలీ సొల్యూషన్స్ గురువారం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించింది. వృత్తి పట్ల ఆదర్శప్రాయమైన నిబద్ధత, అంకితభావాన్ని ప్రదర్శించిన వైజాగ్‌కు చెందిన 9 మంది నిపుణులను సత్కరించారు. ఈ సందర్భంగా టాలీ సొల్యూషన్స్ సౌత్ జోన్ జనరల్ మేనేజర్ అనిల్ భార్గవన్ మాట్లాడుతూ, "వైజాగ్‌లోని టాక్స్ అండ్ అకౌంటింగ్ కమ్యూనిటీ అద్భుతమైన సహకారాన్ని అందించడంతో వేడుక చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. టెక్నాలజీని స్వీకరించడంలో వారి అంకితభావం నేటి డైనమిక్ వాతావరణంలో సవాళ్లను అధిగ మించడానికి, అభివృద్ధి చెందడానికి ఎంఎస్ఎంఇలను శక్తివంతం చేయడంలో కీలకమైనదని పేర్కొన్నారు.

3న జీ రైటర్స్ రూమ్ ఎంపికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఔత్సాహిక రచయితల ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో భాగంగా ఈ నెల 3వ తేదీన విశాఖపట్నంలో జీ రైటర్స్ రూమ్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్టు జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడూరు తెలిపారు. గురువారం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ పలు విభాగాల్లో కథలను మరింత సమర్థవంతంగా మార్చడమే లక్ష్యంగా, సరికొత్త దృక్పథాల కోసం పెరిగిన డిమాండ్ నేపథ్యంలో, సృజనాత్మకత కలిగిన రచయితలను గుర్తించడం కోసం ఈ సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జీ తెలుగులో రాబోయే సీరియల్స్‌కు బలమైన కథలను రాసే రచయితలతోపాటు సినిమా కథకులను సైతం ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి రాత పరీక్ష ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులు రైటర్స్ రూమ్‌లో చేరే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ జాబితాలో ఎంపికైన రచయితలకు పరిశ్రమ నిపుణులు రచనాశైలిలో మెలకువలు నేర్పిస్తారని చెప్పారు. జీ నుంచి రాబోయే ప్రాజెక్టులలో ఈ రచయితలు భాగమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల రచయితలు ఈ నెల 3వ తేదీన ఉదయం 9 నుండి 2 వరకు విశాఖపట్నంలోని యూనిటీ డిగ్రీ కళాశాలలో నిర్వహించే సెలెక్షన్స్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 92462 98135ను సంప్రదించాలని సూచించారు.

ఎండిఆర్‌టి టైటిల్‌కు 8 మంది సలహాదారుల ఎంపిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ 2025 ఎండిఆర్ టీ టైటిల్ కోసం విశాఖపట్నం నుండి 8 మంది సలహాదారులు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ దేవ్ మాట్లాడుతూ, ఇటీవల విడుదలైన గ్లోబల్ ఎండిఆర్‌టి ర్యాంకింగ్ ప్రకారం టాటా ఎఐఎ వరుసగా మూడో సంవత్సరం భారతదేశంలో అత్యధిక సంఖ్య లో ఎండిఆర్‌టి అర్హత కలిగిన సలహాదారులను కలిగి ఉందని తెలిపారు. గ్లోబల్ ర్యాంకింగ్‌ను సాధించిందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో 2,871 ఎండిఆర్‌టి క్వాలిఫైయర్లతో ఈ మైలురాయి మునుపటి సంవత్సరంతో పోలిస్తే 11 శాతం వృద్ధిని సూచిస్తుందని తెలిపారు. ఇది ఎంతో ముదావహం అన్నారు. 1,343 మంది మహిళా ఎండిఆర్‌టి సభ్యులతో టాప్ 25 కంపెనీలలో ఒకటిగా ప్రపంచవ్యాప్తంగా 7 స్థానాన్ని దక్కించుకుందని చెప్పారు.

గోదావరి, రాయగడ ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల సవరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి గోదావరి రాయగడ ఎక్స్‌ప్రెస్‌ల కోచ్‌ల కూర్పును సవరించాలని అధికారులు నిర్ణయించారు.
ఈ క్రమంలో 12728 హైదరాబాద్-విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 29 నుండి, 12727 విశాఖపట్నం-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 30 నుండి సవరించిన కూర్పుతో నడుస్తాయని అధికారులు తెలిపారు. సవరించిన కూర్పు ప్రకారం ఈ రైళ్లలో ఫస్ట్ క్లాస్ ఏసీ -1, 2వ ఏసీ-3, 3వ ఏసీ-6, స్లీపర్-6, జనరల్ సెకండ్ క్లాస్-4, సెకండ్ క్లాస్ కమ్ లగేజ్ (దివ్యాంగన్) కోచ్-1, జనరేటర్ మోటార్ కార్-1 కలుపుకుని మొత్తం 22 కోచ్‌లు ఉంటాయని వివరించారు. 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 1 నుండి, 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2వ తేదీ నుంచి సవరించిన కూర్పుతో నడుస్తాయని తెలిపారు. సవరించిన కూర్పు ప్రకారం ఈ రైళ్లలో 3వ ఏసీ-3, స్లీపర్-12, జనరల్ సెకండ్ క్లాస్-3, సెకండ్ క్లాస్ కమ్ లగేజ్ (దివ్యాంగ్జన్) కోచ్-2 కలుపుకుని మొత్తం 20 కోచ్‌లు ఉంటాయని వివరించారు.



బహుమతులు అందిస్తున్న మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్

రాజవొమ్మంగి విద్యార్థికి బెస్ట్‌చైల్డ్ మెడల్

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో రాజఒమ్మంగి హైస్కూల్ విద్యార్థులు బెస్ట్‌చైల్డ్ అవార్డు మెడల్‌ను గెలుచుకున్నారు. వివి భగీరథ 128వ జయంతి వేడుకల్లో భాగంగా భగీరథ హార్ట్ ఫౌండేషన్ భగీరథ మనవరాలు ఎన్వీపీఎస్ఎస్ లక్ష్మి నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖన పోటీల్లో రాజఒమ్మంగి హైస్కూల్ విద్యార్థి భూముల జీవన్ నాగేంద్ర బెస్ట్‌చైల్డ్‌ఆర్టిస్ట్ అవార్డు గోల్డ్‌మెడల్ మరియు నగదు గెలుచుకున్నాడు. రాజమండ్రిలో శ్రీ చందాసత్రంలో ఎపిస్సి మురళీకృష్ణ ఉండవల్లి అరుణ్‌కుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుముతులు అందించారు. హెచ్ఎం ఆదిలక్ష్మి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జూనియర్ భాగంలో చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డును కొందరమే కాకుండా నలుగురు బంగారు పతకాలు పొందడం గర్వించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ శ్రీనివాస్, డ్రాయింగ్‌టీచర్ కొండబాబు, టి.బొజ్జయ్య, విఘ్నేశ్వరరావు, స్వామి, పాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ గోపాలకృష్ణ

మాదకద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి -చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మహిళా సాధికారత విభాగం ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధకత, మహిళల అక్రమ రవాణానిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చింతూరు సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తియాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. స్త్రీలకు లైంగికవేధింపులు ఎదురైతే ఈ యాప్ ఉపయోగ పడుతుందని, డ్రగ్స్‌కు బానిస అయితే స్వీయ నియంత్రణను కోల్పోతారని, ప్రతి విద్యార్థి దీనిని దృష్టిలోపెట్టుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గోపాలకృష్ణ, రమేష్‌ను అధ్యాపకులు విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లిశేఖర్, సీనియర్ అద్యాపకులు వెంకటరావు, ఎస్.అపనమ్మ, కె.శకుంతల పాల్గొన్నారు.

ఎఎస్ఐ ఉద్యోగ విరమణ


నూకరాజును సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐ నూకరాజు గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా చింతూరు ఎఎస్‌పి, సిఐ మోతుగూడెం సిబ్బంది కార్యక్రమానికి హాజరై నూకరాజుకి శుభాకాంక్షలు తెలిపారు. శేషజీవితం సుఖంగా ఉండాలని కోరారు.